క్లుప్తంగా

పత్తిచేలను పరిశీలించిన డీఏఓ

చింతపల్లి : మండలం కుర్మేడ్‌లోని పత్తిచేలను ఆదివారం జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ) పాల్వాయి శ్రావణ్ కుమార్ సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో అధిక వర్షాలు కురుస్తున్నందున రైతులు జాగ్రత్తలు తీసుకోవాని కోరారు. వర్షాలకు రైతులు తప్పనిసరిగా వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలు తీసుకోవాలన్నారు. వర్షాల కారణంగా పత్తి చేనుకు చీడపురుగుల బెడద పొంచి ఉందన్నారు.ప్రస్తుత సీజన్‌లో రైతులకు అందుబాటులో అన్ని రకాల ఎరువులను ఉంచినట్లు పేర్కొన్నారు. జిల్లాలో యూరియా కొరత లేకుండా ముందస్తు చర్యలను తీసుకుంటున్నట్లు తెలిపారు. వ్యవసాయ అధికారుల సూచనలతో రైతులు అధిక దిగుబడులను సాధించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ నరసింహ ఉన్నారు.

ముత్యాలమ్మకు ఎమ్మెల్యే పూజలు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని గాంధీనగర్ కలాల్‌వాడలో ముత్యాలమ్మ అమ్మవారికి స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అలాగే పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కోల సైదులు, మాజీ మున్సిపల్ చైర్మన్ మెరుగు రోశయ్య, మాజీ వైస్ చైర్మన్ సైదులు, శ్రీనివాస్, రామస్వామి, వెంకన్న, వెంకటేశ్వర్లు, శేఖర్, రాంబాబు, శ్రీనివాస్, బిక్షం, రవి, లక్ష్మీనారాయణ, మట్టయ్య, మురళి, సైదులు, రమేష్, దుర్గయ్య, సోములు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ అప్పగింత



బాధితుడికి మొబైల్ ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్‌ఐ వీరబాబు

పెద్దవూర: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను ట్రేస్ చేసి బాధితుడికి ఆదివారం ఎస్‌ఐ పి.వీరబాబు అప్పగించారు. మండల కేంద్రంలోని రంగప్ప కాలనీకి చెందిన బచ్చిరెడ్డి పుల్లారెడ్డి తన మొబైల్ ఫోన్‌ను చెక్‌పోస్టు సమీపంలో పోయినట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వెంటనే సెల్‌ఫోన్ పోగొట్టుకున్న ప్రాంతం వివరాలతో బాధితుడు పేరు, చిరునామా, గుర్తింపు పత్రం, ఓటీపీ కోసం ఫోన్ నంబర్‌ను ఫిర్యాదులో పొందుపర్చాలని సూచించారు. ఆయా వివరాలతో పోర్టల్‌లో నమోదు చేసిన అనంతరం పోగొట్టుకున్న ఫోన్ పనిచేయకుండా బ్లాక్ చేసి, ఎవరు వినియోగిస్తున్నారో గుర్తించేందుకు నిఘా పెట్టినట్లు తెలిపారు. ఐ ఎంఈఐ(ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ) కీలకమైనదని అన్నారు. బాధితుడు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను తిరిగి అప్పగించినట్లు తెలిపారు.

ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ

నల్లగొండ క్రైం: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత్ వాతావరణంలో నిర్వహించుకోవాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పట్టణ శాంతి సంఘం సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండప నిర్వాహకులు విగ్రహ నిర్వహణకు అవసరమైన అన్ని శాఖల అనుమతులు తీసుకోవాలన్నారు. వినాయక విగ్రహాల ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపరిచి అప్లికేషన్‌ను సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అందజేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ రమేష్‌గౌడ్, వన్ టౌన్, టూటౌన్ సీఐలు రాజశేఖర్‌రెడ్డి, డేనియల్, ట్రాఫిక్ సీఐ క్రాంతికుమార్, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమిత్రల సమ్మె వాయిదా

మర్రిగూడ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆరోగ్య మిత్రలు చేపట్టిన నిరవధిక సమ్మె వాయిదా వేస్తున్నట్లు ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య తెలిపారు. సెప్టెంబర్ 2 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నామని.. వర్షాల కారణంగా పేద ప్రజలకు ఇబ్బందులు కలుగకూడదని వైద్యారోగ్యశాఖ మంత్రి ఆదేశానుసారం తమ సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని శివాజీనగర్ ఎస్సీకాలనీలో పేకాట స్థావరాలపై దాడి చేసి పలువురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రవీందర్‌నాయక్ ఆదివారం తెలిపారు. ఎస్సీకాలనీలో మచ్చ నాగేంద్రబాబు ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమ్మదగిన సమాచారంతో దాడిచేసి 12మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ.13,970నగదు, 9మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.



మిర్యాలగూడ : లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



పెద్దవూర : కత్వపై నుంచి పారుతున్న పెద్దవాగు



మిర్యాలగూడ : మయూరినగర్‌లో ఇళ్ల మధ్య చేరిన వరద

దంచికొట్టిన వాన

పొంగిన వాగులు, చెరవులు

- నీట మునిగిన పంటపొలాలు
- పలుచోట్ల ఇళ్లలోకి చేరిన వర్షపునీరు
- వాగుల వద్ద రహదారులను మూసివేసిన అధికారులు



తిరుమలగిరి(సాగర్) : లక్ష్మీపురంతండా వద్ద నీటమునిగిన పత్తి చేను



నాగార్జున సాగర్ : నందికొండ మున్సిపాలిటీలో రోడ్లపై విరిగి పడ్డ చెట్లను తొలగిస్తున్న అధికారులు

హాలియా : అనుముల మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, మండలంలోని పేరూర్ చెరువులోకి భారీగా వరద చేరడంతో పాటు చెరువు పొంగి ప్రవహిస్తోంది. దీంతో మదారిగూడెం–పేరూర్ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచాయి. అదే విధంగా మండలంలోని యాచారం–రామడుగు గ్రామాల మధ్య ఉన్న కల్వర్టుపై నుంచి వరద ఉధృతంగా ప్రవహించడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఎడతెరిపి లేని వర్షంతో అహల్య వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. మండల వ్యాప్తంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హాలియా మున్సిపల్ కమిషనర్ రామ దుర్గారెడ్డి కోరారు.

నందికొండలో రోడ్లపై కూలిన చెట్లు

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీలోని పలు కాలనీల్లో భారీ వర్షానికి చెట్లు విరిగి రోడ్లపై పడ్డాయి. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పాడ్డాయి. కొన్ని చోట్ల విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మున్సిపాలిటీ కమిషనర్ దండు శ్రీను తమ సిబ్బందితో ఆదివారం చెట్లను, చెట్ల కొమ్మలను తొలగించారు. దీంతో ప్రజల రాకపోకలకు, విద్యుత్ సరఫరాకు అంతరాయం తొలగింది.

పెద్దవూర: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వాగులు, చెరువులు, కుంటలు నిండి పొంగి పొర్లుతున్నాయి. మండలం నుంచి ప్రవహించే పెద్దవాగు పొంగి పొర్లుతుంది. దీంతో పెద్దవూర సమీపంలోని కత్వాపై నుంచి జలాలు కిందకు ఎత్తిపోస్తుండటంతో పరిసర గ్రామాల ప్రజలు ఈ సుందర దృశ్యాన్ని చూడటానికి ఆసక్తి చూపారు. మండలంలోని పెద్దవూర, పోతునూరు, సంగారం, నాయినివానికుంట, చింతపల్లి, శిర్సనగండ్ల, వెల్మగూడెం తదితర గ్రామాలలోని చెరువులు నిండి అలుగులు పోస్తున్నాయి. మండలంలోని పర్వేదుల–పెద్దవూర రహదారిపై ఉన్న కల్వర్టుపై నుంచి చిన్నవాగు పొర్లుతుంది.

డిండి : రెండు రోజులు నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి డిండి గ్రామపంచాయతీ పరిధిలోని ఎడ్లగడ్డతండాకు చెందిన మూడావత్ శాంతి ఇల్లు ఆదివారం ఉదయం కూలిపోయింది. దీంతో తాను నివాసం ఉంటున్న ఇల్లు కూలిపోవడంతో ఇబ్బందికరంగా మారిందని శాంతి తన ఆవేదనను వ్యక్తం చేస్తూ ప్రభుత్వం ఆదుకోవాలని కోరింది.



కొండమల్లేపల్లి : అంబేద్కర్ నగర్‌లో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు



తిరుమలగిరి(సాగర్) : బోయిగూడెంలో వర్షానికి కూలిపోయిన ఇంటి పై కప్పు

ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

కొండమల్లేపల్లి : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కొండమల్లేపల్లిలోని పలు ప్రాంతాల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. పలు చోట్ల ఇళ్లలోకి వర్షపు నీరు రాగా వారు తీవ్ర ఇబ్బందులు పడగా వర్షపు నీటిని బయటికి ఎత్తిపోశారు.. మరికొన్ని చోట్ల వర్షపు నీరు కుంటలను తలపించింది. అలాగే హైదరాబాద్ రోడ్డులోని అంబేడ్కర్ కాలనీలోని డబుల్ బెడ్రూం ఇళ్ల వెనుక భాగంలోవర్షపు నీరు చేరడంతో కుంటను తలిపిస్తుంది.



కొండమల్లేపల్లి : అంబేద్కర్ కాలనీలో ఇళ్ల మధ్యన వర్షపు నీరు

చందంపేట : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చందంపేట తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని ముర్పునూతల నుంచి మన్నెవారిపల్లికి వెళ్లే మార్గంలో ఉన్న డిండి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆదివారం వాగును ఆయన పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. చందంపేట ఎస్‌ఐ సతీష్ వాగు ఎవరూ దాటకుండా గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను అడ్డుగా పెట్టించారు.

వరుద నీటిలోనే పంట పొలాలు

తిరుమలగిరి(నాగార్జున సాగర్) : రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి మండలంలోని పత్తి, వరి, మిర్చి ఇతర పంటలు జలమయం అయ్యాయి. మండలంలోని బోయగూడెం గ్రామానికి చెందిన మెండె లింగయ్య రేకుల ఇంటి పైకప్పు కూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రెండు రోజులుగా కురిసిన వర్షానికి తిరుమలగిరి పెద్ద చెరువు అలుగుపోస్తుంది. .



చందంపేట : వాగు ఉధృతంగా ప్రవహించడంతో రహదారిని బంద్ చేసిన పోలీసులు



చందంపేట : వాగును పరిశీలిస్తున్న చందంపేట తహసీల్దార్

వేములపల్లి (మాడ్గులపల్లి) : మాడుగులపల్లి మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా చెరువులు, వాగులు, చెక్‌డ్యాంలు నిండి అలుగుపోస్తున్నాయి. మండలంలోని కల్వలపాలెం చెరువు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రోడ్డు తెగిపోయింది. దీంతో గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అదేవిధంగా చెరువుపల్లి గార్ల చెరువును తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ తండు సైదులుగౌడ్ పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సాగర్, లింగారెడ్డి, పెద్దిరాజు, వెంకన్న, దేవయ్య పాల్గొన్నారు.



వేములపల్లి : తెగిపోయిన కల్వలపాలెం రోడ్డు



హాలియా : పేరూర్ చెరువు అలుగు దాటుతూ వెళ్తున్న ప్రజలు



తిరుమలగిరి (సాగర్) : అలుగుపోస్తున్న తిరుమలగిరి పెద్ద చెరువు



పెద్దవూర-పర్వేదులలో కల్వర్టుపై నుంచి వెళ్తున్న వరద



పెద్దవూర : అలుగుపోస్తున్న పెద్దవూర చెరువు



కొండమల్లేపల్లి : గుమ్మడవెల్లిలో కూలిన ఇంటి గోడను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆదేశించారు. ఆదివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఏ ఒక్కరూ అనుమతి లేకుండా సెలవులు పెట్టరాదన్నారు. ఏ సమాచారం అయినా వెంటనే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. విద్యుత్ కోతలు విధించవద్దన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తగా ఉండాలన్నారు. అనంతరం పట్టణంలోని ఆయా షాబునగర్, తాళ్లగడ్డ, బంగారుగడ్డ తదితర లోతట్టు ప్రాంతాలను సందర్శించి ఆయా కాలనీవాసులతో మాట్లాడారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ ఎండి.యూసుఫ్, తహసీల్దార్ హరిబాబు, ఎంపీడీఓ శేషగిరిశర్మ, సీఐలు కరుణాకర్, నాగార్జున, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలపట్ల కొండమల్లేపల్లి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ రాంరెడ్డి సూచించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలోని గుమ్మడవెల్లి పంచాయతీ ఎంజీఆర్ కాలనీలోకి వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది. దీంతో జేసీబీ ద్వారా కాల్వను తవ్వించి వర్షపు నీరు కుంటలోకి వెళ్లేలా పనులు చేపడుతున్నారు. కాగా గ్రామంలోని పాత ఇల్లు కూలడంతో సమాచారం అందుకున్న ఎంపీడీఓ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. అలాగే రోడ్లపై చెట్లు విరిగిపడడంతో పంచాయతీ కార్యదర్శి వాటిని తొలగించారు. పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటూ అవసరం మేరు ప్రజలకు తగిన సహాయక చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ సూచించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



అడవిదేవులపల్లి అలుగును పరిశీలిస్తున్న ఎంపీడీఓ కరుణాకర్‌రావు

అడవిదేవులపల్లి : వర్షాల నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై గ్రామ కార్యదర్శులు ప్రత్యేక దృష్టిని సారించాలని ఎంపీడీఓ కరుణాకర్ రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రం పరిధిలోని బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. అనంతరం రెండు రోజుల పాటు కురిసిన వర్షానికి అలుగుపోస్తున్న ప్రదేశాన్ని పరిశీలించిమాట్లాడారు. కృష్ణా పరివాహాక ప్రాంతాల ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ మోహసిన్ బిన్ అహ్మద్, సూపరింటెంట్ అమీర్, హాస్టల్ వార్డెన్ ఉమామహేశ్వర్ తదితరులున్నారు.

నేటి నుంచి ఎస్ఎఫ్ఐ పోరు యాత్ర

నల్లగొండ టౌన్ : సంక్షేమ హాస్టళ్ల సంరక్షణ, విద్యారంగ పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించే మోటారు సైకిల్ యాత్రను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కోకన్వీనర్ కుంచం కావ్య పిలుపునిచ్చారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని బాలికల హాస్టల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 27 మండలాల్లో కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పావని, స్పందన, దివ్య, జ్యోతి, సింధు తదితరులు పాల్గొన్నారు.

యోగాసన పోటీలకు ఎంపిక



పోటీలను ప్రారంభిస్తున్న కుంభం నర్సిరెడ్డి

నల్లగొండ టూటౌన్: యోగా అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నల్లగొండ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో యోగాసన పోటీలను అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుంభం నర్సిరెడ్డి ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 60 మంది పాల్గొనగా ప్రతిభ కనబర్చినవారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 7, 8 తేదీల్లో హైదరాబాదులో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారని నర్సిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ రాజశేఖర్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలను పరిశీలించిన డీటీడీఓ



ఎస్టీ హాస్టల్‌ను పరిశీలిస్తున్న డీటీడీఓ రాజ్‌కుమార్



ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న డీటీడీఓ రాజ్‌కుమార్

పెద్దవూర : ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మండల కేంద్రంలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలను ఆదివారం జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి(డీటీడీఓ) రాజ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా బిల్డింగ్ కండీషన్, పరిశుభ్రత, నీటి నిల్వ సామర్థ్యం, చెత్తాచెదారం తొలగింపు వంటి వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడురోజుల నుంచి వర్షాలు కురుస్తున్నందున అంటువ్యాధులు ప్రభలకుండా వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని, విద్యార్థులకు నాణ్యమైన వేడిగా ఉన్న భోజనాన్ని వడ్డించాలని పేర్కొన్నారు. విద్యార్థులు వర్షంలో తడవకుండా ఉండేలా చూడాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ ఉమాదేవి, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, స్థానిక వార్డెన్‌లు కొల్లు బాలకృష్ణ, సుధాకర్, రమేష్, అహల్య తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చేరిన వర్షపు నీరు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో అంబేద్కర్ కాలనీకి వెళ్లే మార్గంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ వర్షపు నీరు చేరడంతో స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుదాఘాతం చోటుచేసుకుంటే ఎవరూ బాధ్యత వహిస్తారంటూ విద్యుత్ శాఖ అధికారులు స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పశువులు, మూగజీవాలు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు ఉన్న నీటిలోకి వెళ్తే ఏదైన ప్రమాదం జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రహదారి ఏర్పాటుకు తొలగిన అడ్డంకులు

- నక్కలగండి ముంపు గ్రామాల రోడ్డుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- సర్వే చేస్తున్న అధికారులు



సర్వే చేస్తున్న అధికారులు

చందంపేట : నక్కలగండి ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకుగురైన గ్రామాలకు రహదారి ఏర్పాటుకు మోక్షం కలగనుంది.. ఏళ్ల తరబడి శాశ్వత దారి లేక ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. ఈ క్రమంలో భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టారు. మండలంలోని తెల్దేవరపల్లి గ్రామానికి వెళ్లే రహదారికి నిర్మాణానికి సర్వే చేపట్టినట్లు ఇరిగేషన శాఖ డీఈ చక్రపాణి తెలిపారు. కోరుట్ల నుంచి నల్లమల్ల అటవీ ప్రాంతం గుండా ఆరు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి రూ.69 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. అటవీ శాఖ అనుమతులు లభించకపోవడంతో రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో పది రోజులు సర్వే చేపట్టి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్, అటవీ, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా మాసకల్యాణం

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీస్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మాసకల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో స్వామివార్ల విగ్రహాలకు పూలతో, పట్టువస్త్రాలతో అందంగా అలంకరించారు. అనంతరం పుణ్యావచనం, పంచామృతాభిషేకాలు, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ, వంటి కార్యక్రమాలతో కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ కొండారెడ్డి, అర్చకులు కొంకపాక విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయశర్మ, శంభిరెడ్డి పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు